
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 26 । ఫిబ్రవరి । 2024



సోమశిలలో 18.072 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 18.072 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3,650 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.64,250
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,770
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,943
సవర (8 గ్రాములు)	రూ.47,544

గరిష్టం/కనిష్టం
33.2 /26.0

వాతావరణం

ఆదివారం గాలిలో తేమ 65 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. సోమవారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

జిల్లాలో 1.16 కోట్ల పనిదినాలు

- డ్వామా పీడీ వెంకట్రావు



మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకట్రావు

పొదలకూరు: జిల్లాలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి మార్చి చివరి నాటికి 1.16 కోట్ల పనిదినాలు పూర్తి చేయడం లక్ష్యంగా నిర్దేశించినట్లు డ్వామా పీడీ డి.వెంకట్రావు తెలిపారు. ఆదివారం పొదలకూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముందుగా 1.14 కోట్ల పనిదినాలు లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ తర్వాత అదనంగా మరో 2 లక్షల పనిదినాలు కేటాయించారని తెలిపారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా నిత్యం 17 వేల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారని తెలిపారు. మార్చిలో ప్రతి రోజూ 30 వేల మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామసభల ద్వారా పనులను గుర్తించామని, 1.05 కోట్ల పనిదినాలు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ప్రధానంగా పొలాల్లో కుంటలు, కాలువల తవ్వకం, ఉద్యాన పంటల చుట్టూ ట్రెంచ్‌లు కొట్టడం తదితర పనులను కూలీల ద్వారా చేపట్టామని తెలిపారు. గ్రామాల్లో క్షేత్ర సహాయకులపై వచ్చే ఆరోపణలు నిజమని తేలితే వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో వైఎస్సార్ జలకళ పథకం ద్వారా రైతుల పొలాల్లో 2,480 బోర్లు వేశామని, విద్యుత్ సౌకర్యం ఉన్న చోట్ల ప్రభుత్వం విద్యుత్ మోటార్లను కూడా ఉచితంగా అందజేస్తోందని తెలిపారు.

డ్రైవర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు సిటీ: వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ(1962) వాహనాలకు సంబంధించి ఆరుగురు డ్రైవర్ల నియామకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మేనేజర్ నెమలి శివశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు నెల్లూరు రైల్వే ఫీడర్స్ రోడ్డులోని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై 40 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు ఈ డ్రైవర్ పోస్టులకు అర్హులని తెలిపారు. వివరాలకు 9704165512 ఫోన్‌నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

రేపటి నుంచి టెట్

- హాజరుకానున్న 6,363 మంది అభ్యర్థులు

నెల్లూరు(టౌన్): టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పరీక్షను మంగళవారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. జిల్లాలో కోవూరు సమీపంలోని గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పీజీ స్టడీస్ సెంటర్, జొన్నవాడ సమీపంలోని ఆయాన్ సెంటర్, కావలిలోని పీబీఆర్ విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాల, ఆర్‌ఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలల్లో టెట్ పరీక్షను నిర్వహించనున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో ఈ పరీక్షకు జిల్లావ్యాప్తంగా మొత్తం 6,363 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. కేజీబీవీ సెక్రటరీ మధుసూదనరావు టెట్ పరీక్ష పరిశీలకులుగా వ్యవహరిస్తున్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు



పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న గ్రూప్-2 అభ్యర్థులు

నెల్లూరు(దర్గామిట్ట): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగినట్లు ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్‌మర్మత్ తెలిపారు. నెల్లూరులోని పప్పులవీధి మున్సిపల్ హైస్కూల్, ఆర్‌ఎస్‌ఆర్ హైస్కూల్, నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్, బీవీఎస్ హైస్కూల్ తదితర పరీక్ష కేంద్రాలను ఇన్‌చార్జి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించామన్నారు. పరీక్షల నిర్వహణకు 30 మంది రూట్ ఆఫీసర్లను నియమించామన్నారు. జిల్లాలోని 80 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షలకు 23,908 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 20,133 మంది హాజరైనట్లు తెలిపారు.



బీవీఎస్ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్‌మర్మత్

అతిథి గృహాలకు మహర్దశ

ప్రజాప్రతినిధులు, అధికారులు తమ విధి నిర్వహణలో భాగంగా విడిది చేసే ఆర్‌అండ్‌బీ అతిథి గృహాలు గత టీడీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురయ్యాయి. కనీసం మరమ్మతులకు కూడా నోచుకోక శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి దుస్థితిని గమనించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయించి ఆధునికీకరణ పనులు చేపడుతోంది.

- రూ.3.64 కోట్లతో ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌ల ఆధునికీకరణ పనులు
- జిల్లాలోని అతిథి గృహాల అభివృద్ధికి టెండర్ల నిర్వహణ
- ఇప్పటికే నెల్లూరులో పూర్తవుతున్న పనులు
- సుందరంగా మారనున్న గెస్ట్ హౌస్‌లు



నెల్లూరులో సుందరంగా తీర్చిదిద్దుతున్న ఆర్‌అండ్‌బీ అతిథి గృహం

నెల్లూరు(బారకాసు): ఉమ్మడి జిల్లాలోని ఆర్‌అండ్‌బీ (రహదారులు, భవనాల శాఖ) అతిథి గృహాలు చాలాకాలంగా మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరుకున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహాలను అభివృద్ధి చేయాలన్న ఆలోచనే చేయలేదు. ఉమ్మడి జిల్లాలోని తడలో ఉన్న ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఏ క్షణంలోనైనా కూలే స్థితిలో ఉంది. తరచూ అధికారులు విశ్రాంతి కోసం విడిది చేసే కొన్ని అతిథి గృహాలకు మాత్రం అప్పుడప్పుడూ నామమాత్రంగా మరమ్మతులు చేస్తుంటారు. మరి కొన్నింటిని అసలు పట్టించుకున్న దాఖలాలు లేవు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్‌అండ్‌బీ అతిథి గృహాలకు మహర్దశ పట్టింది. ఆర్‌అండ్‌బీ అతిథి గృహాలను ఆధునికీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఆ శాఖ అధికారులు కలెక్టర్ సూచనల మేరకు అతిథి గృహాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. ఇందు కోసం ఇటీవల టెండర్ ప్రక్రియ కూడా నిర్వహించారు. ఆయా అతిథి గృహాలన్నింటిలో ఆధునికీకరణ పనులు పూర్తయితే అవన్నీ సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకోనున్నాయి.

ప్రారంభమైన ఆధునికీకరణ పనులు

జిల్లాలో మూడు అతిథి గృహాలను ఆధునికీకరించేందుకు కాంట్రాక్టర్లు టెండర్లు దక్కించుకున్నారు. మరో నాలుగు అతిథి గృహాలకు సంబంధించి టెండర్లు వేశారు. ఈ నెల 26వ తేదీన ఈ టెండర్లు తెరవనున్నారు. ఇందులో ప్రభుత్వం నిర్ణయించిన మొత్తాని కన్నా తక్కువ మొత్తంలో కోడ్ చేసి ఎవరైతే టెండర్ వేసి ఉంటారో వారికే కేటాయించే అవకాశం ఉంది. ఇప్పటికే టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నెల్లూరు నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. పనులు పూర్తవుతుండగా ఈ గెస్ట్ హౌస్ ఎంతో సుందరంగా తయారైంది.

ఒక్కో అతిథి గృహానికి ఎంతెంతంటే..

ఆర్‌అండ్‌బీ అతిథి గృహాల ఆధునికీకరణకు ప్రభుత్వం నిర్దేశించిన అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ శాంక్షన్ ప్రకారంగా నెల్లూరు అతిథి గృహానికి రూ.46.50 లక్షలు, ఆత్మకూరు అతిథి గృహానికి రూ.48.50 లక్షలు, పొదలకూరు అతిథి గృహానికి రూ.43.05 లక్షలు, కోవూరు అతిథి గృహానికి రూ.49.33 లక్షలు, వింజమూరు అతిథి గృహానికి రూ.42.50 లక్షలు, వెంకటగిరి అతిథి గృహానికి రూ.65 లక్షలు, తడ అతిథి గృహానికి రూ.69.80 లక్షల చొప్పున కేటాయించారు. రూ.3.64 కోట్లతో ఆధునికీకరణ పనులు నిర్వహిస్తున్నారు.

13 ప్రాంతాల్లో 15 గెస్ట్ హౌస్‌లు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 13 ప్రాంతాల్లో 15 ఆర్‌అండ్‌బీ అతిథి గృహాలు ఉన్నాయి. ఇందులో నెల్లూరు, పొదలకూరు, కావలి, కోవూరు, వింజమూరు, ఉదయగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి, తడలో ఒక్కొక్కటి.. కందుకూరు, ఆత్మకూరులలో రెండేసి చొప్పున ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లు ఉన్నాయి. వీటిలో కందుకూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు, కావలి, ఉదయగిరి మినహా మిగిలిన 7 ప్రాంతాల్లోని అతిథి గృహాల్లో ఆధునికీకరణ పనులు చేపట్టి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. ఇందులో నెల్లూరు నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఇప్పటికే ఆధునికీకరణ పనులు ప్రారంభమై పూర్తయ్యే దశలో ఉన్నాయి. అలాగే కోవూరు, వింజమూరులలోని అతిథి గృహాల్లో త్వరలో పనులు చేపట్టనున్నారు. మిగిలిన తడ, వెంకటగిరి, ఆత్మకూరు, పొదలకూరులకు సంబంధించిన అతిథి గృహాలకు టెండర్లు పూర్తి కాగానే పనులు ప్రారంభించనున్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే అభివృద్ధి



గత టీడీపీ ప్రభుత్వంలో జిల్లాలో ఎక్కడా చెప్పుకునేంత అభివృద్ధి జరగలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా ఎంతో అభివృద్ధి జరిగింది. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆస్పత్రులను సుందరంగా తీర్చిదిద్దారు. తాజాగా జిల్లాలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహాలను ఆధునికీకరణ పనులతో అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు.

– బ్రహ్మయ్య, నవాబుపేట

అతిథి గృహాలు బాగుపడుతున్నాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తోంది. గత ప్రభుత్వంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహాల అభివృద్ధిని పట్టించుకోలేదు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న అతిథి గృహాలు శిథిలావస్థలో ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆధునికీకరణ పనులు చేపట్టడం ద్వారా ఈ గెస్ట్ హౌస్‌లు బాగుపడుతున్నాయి.

– ఎస్‌కే షాజహాన్, న్యూకాలనీ, జాకీర్‌హుస్సేన్ నగర్

త్వరితగతిన పూర్తి చేస్తాం



జిల్లాలోని 7 ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బీ అతిథి గృహాలను ఆధునికీకరించి సుందరంగా తీర్చిదిద్దనున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టెండర్లు నిర్వహించాం. ఇప్పటికే నెల్లూరు నగరంలో ఉన్న అతిథి గృహానికి మరమ్మతులు చేపడుతున్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తాం.

– గంగాధర్, ఎస్‌ఈ, జిల్లా సర్కిల్ కార్యాలయం, ఆర్‌అండ్‌బీ, నెల్లూరు

వైద్య కళాశాలలో క్రిటికల్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన

- వర్చువల్‌గా పనులను ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోదీ



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్‌మర్మత్

నెల్లూరు సిటీ: నెల్లూరులోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మించనున్న క్రిటికల్ కేర్ బ్లాక్ పనులను ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ గుజరాత్‌లోని రాజ్‌కోట్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఏసీఎస్‌ఆర్ మెడికల్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్ మర్మత్, హాస్పిటల్ సూపరింటెండెంట్ సిద్దానాయక్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ సునంద, ప్రొఫెసర్లు, వైద్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆధునిక వైద్యం అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నెల్లూరులోని ఏసీఎస్‌ఆర్ వైద్య కళాశాలలో రూ.23.75 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఆయుష్మాన్‌భారత్, వికసిత్ భారత్‌లో భాగంగా అనేక చోట్ల వైద్య సంస్థలను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఆధునిక వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ప్రధాని మోదీ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్ మర్మత్ మాట్లాడుతూ నెల్లూరులోని ఏసీఎస్‌ఆర్ మెడికల్ కళాశాలలో ఆధునిక క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణం ద్వారా ఆధునిక వైద్య పరికరాలు, స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. ఏపీ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ క్రిటికల్ కేర్ బ్లాక్‌లో రూ.16.63 కోట్లతో సివిల్ పనులు నిర్వహించడంతో పాటు రూ.7.12 కోట్లతో ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి హెచ్‌ఓడీ కళారాణి, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ మస్తాన్‌బాషా, వైద్యులు పాల్గొన్నారు.

మంచి చేసిన వారినే గెలిపించండి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన చేనేతలతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: గత టీడీపీ ప్రభుత్వ పనితీరు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పనితీరులను ప్రజలు బేరీజు వేసుకుని మంచి చేసిన వారినే గెలిపించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోరారు. మనుబోలులో బొమ్మిరెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీ నుంచి 50 చేనేత, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి మంత్రి కాకాణి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ తీసుకోవాలంటే గంటల తరబడి వృద్ధులు క్యూల్లో నిల్చోవాల్సి వచ్చేదని గుర్తుచేశారు. ప్రస్తుతం అదే పింఛన్‌ను ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికే వచ్చి అందజేస్తున్నట్లు తెలిపారు. పొదుపు మహిళల బ్యాంకు రుణానికి సంబంధించిన మొత్తాన్ని నాలుగు విడతల్లో చెల్లించామన్నారు. అమ్మఒడి, రైతు భరోసా, కాపునేస్తం, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, ఈబీసీ నేస్తం, మత్స్యకార భరోసా తదితర హామీలన్నీ నెరవేర్చామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్న నేస్తం పథకం ద్వారా చేనేతలకు ఏడాదికి రూ.24 వేల చొప్పున అందజేస్తున్నారని తెలిపారు.

రూ.376 కోట్లతో సీసీ రోడ్లు

సర్వేపల్లి నియోజకవర్గంలో రూ.376 కోట్లతో సీసీ రోడ్లు వేశామని, అవసరమైన చోటల్లా సైడ్ డ్రెయిన్లు నిర్మించామని, తాగు, సాగునీరు అందించామని మంత్రి కాకాణి తెలిపారు. ఒక్క మనుబోలు మండలంలోనే రూ.19 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర కల్పించి అన్నదాతల అభ్యున్నతికి కృషి చేస్తోందని తెలిపారు. టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తనను ఇంటికి పంపుతానని అంటున్నాడని, ఎవరినైనా ఇంటికో, అసెంబ్లీకో పంపే శక్తి ప్రజలకు మాత్రమే ఉందని మంత్రి అన్నారు. సోమిరెడ్డికి ఇప్పటికి కూడా సీటు ఇస్తారని గ్యారెంటీ లేదన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నానని కాకాణి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా చేనేతలు మంత్రిని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, సర్పంచ్ కంచి పద్మమ్మ, ఉప సర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, బొమ్మిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, పార్థురెడ్డి, చైతన్యరెడ్డి, మహేష్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, మన్నెమాల సుధీర్‌రెడ్డి, మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, నవకోటి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అతివలకు ఆయుధం 'దిశ'

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మహిళలు, యువతులు, చిన్నారులపై దాడులు నిత్యకృత్యంగా ఉండేవి. బాధితులు తమ సమస్యలను నేరుగా ఫిర్యాదు చేసే పరిస్థితి లేకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల భద్రతకు పెద్దపీట వేశారు. వారిపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టేందుకు దిశ చట్టాన్ని రూపొందించి అమలు చేస్తున్నారు. దిశ పోలీస్‌స్టేషన్లు, దిశ యాప్ ద్వారా మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. తద్వారా నేరాలు తగ్గుముఖం పట్టి మహిళలు ధైర్యంగా జీవించగలుగుతున్నారు.

- మహిళలకు రక్షణగా దిశ చట్టం
- కౌన్సెలింగ్‌తో కుటుంబ వివాదాల పరిష్కారం
- ఆపద సమయాల్లో రక్షణ కవచంలా దిశ యాప్
- వేధింపులపై ఉక్కుపాదం
- మహిళల్లో పెంపొందిన ఆత్మస్థైర్యం



గతేడాది కందుకూరుకు చెందిన ఓ మహిళ ఊరెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చింది. అప్పటికే బస్సు వెళ్లిపోవడంతో నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో అదే పట్టణానికి చెందిన కరణ్, జోషి, ఫిరోజ్ బాషా ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో ఆమె కేకలు వేసింది. స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి దిశ ఎస్‌ఓఎస్‌కు కాల్ చేయడంతో పోలీసులు నిమిషాల వ్యవధిలోనే ఘటనాస్థలికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. బాధిత మహిళను సురక్షితంగా ఆమె ఇంటి వద్ద వదిలిపెట్టారు.

2022లో విదేశీ మహిళపై లైంగిక దాడి యత్నం కేసులో రోజుల వ్యవధిలోనే దిశ పోలీసులు దర్యాప్తును పూర్తి చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. దీంతో కోర్టు నిందితులకు శిక్షలు వేసింది. పోక్సో కేసుల్లోనూ నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా దిశ పోలీసులు చర్యలు చేపడుతున్నారు. దిశ పోలీస్‌స్టేషన్‌లో సత్వర న్యాయం జరుగుతుండడంతో పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి.

నెల్లూరు(క్రైమ్): మహిళలు, యువతులు, చిన్నారుల భద్రతను గత టీడీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. దీంతో వారి రక్షణ మిథ్యగా మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల భద్రత కోసం చట్టాలకు పదును పెట్టడంతోపాటు వ్యవస్థలను పటిష్టం చేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా దిశ పోలీస్‌స్టేషన్లు, దిశ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఏపీ దిశ యాక్ట్-2019ను రూపొందించారు. మహిళా సమస్యల పరిష్కారం కోసం గ్రామ/వార్డు సచివాలయాల్లో మహిళా సంరక్షణ కార్యదర్శులను నియమించారు. వారి ద్వారా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి చేపట్టిన చర్యలతో మహిళలు, యువతులు, చిన్నారులపై అకృత్యాలు తగ్గుముఖం పట్టాయి. 'దిశ'తో వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొంది తమకు ఏ చిన్న సమస్య వచ్చినా నిర్భయంగా ఫిర్యాదు చేస్తున్నారు.

'దిశ'పై విస్తృత ప్రచారం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళల భద్రత విషయంలో నూతన అధ్యాయానికి తెరతీసింది. మహిళా పోలీస్‌స్టేషన్‌ను దిశ పోలీస్‌స్టేషన్‌గా అప్‌గ్రేడ్ చేసింది. నెల్లూరులోని జిల్లా సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్) ఆవరణలో ఉన్న ఈ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేసేలా ఏర్పాట్లు చేశారు. మహిళలపై దాడులు జరిగిన సందర్భాల్లో వారికి సాయం అందించడం, శాస్త్రీయంగా ఆధారాల సేకరణ కోసం ప్రత్యేక వాహనాన్ని సమకూర్చారు. దిశ చట్టం, దిశ యాప్‌పై విస్తృత ప్రచారం కల్పించడం ద్వారా బాధితులు నేరుగా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయిస్తున్నారు. వారి సమస్యలపై సిబ్బంది తక్షణమే స్పందించి కేసులు నమోదు చేయడంతోపాటు రోజుల వ్యవధిలోనే కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేస్తున్నారు. తద్వారా నేరస్తులకు శిక్షలు పడుతున్నాయి.

కౌన్సెలింగ్‌తో సమస్యలకు పరిష్కారం

దిశ పోలీసులు కౌన్సెలింగ్ ద్వారా కుటుంబ వివాదాలను పరిష్కరించి వారి జీవితాల్లో మళ్లీ ప్రేమానురాగాలు నింపుతున్నారు. ప్రధానంగా దంపతుల విషయంలో పిల్లల భవిష్యత్, సమాజంలో చిన్నచూపు తదితరాలను విడమరిచి చెప్పి వారిలో మార్పు తీసుకువచ్చి హాయిగా గడిపేలా ప్రోత్సహిస్తున్నారు. 2020 నుంచి ఇప్పటి వరకు వివిధ సమస్యలపై 4,774 ఫిర్యాదులు అందగా, కౌన్సెలింగ్ ద్వారా 4,075 సమస్యలను పరిష్కరించారు. 665 ఫిర్యాదులపై కేసులు నమోదు చేశారు. మిగిలిన ఫిర్యాదులకు సంబంధించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అలాగే కామాంధులపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. మహిళలు, యువతులు, చిన్నారులపై లైంగికదాడులు, వేధింపులపై ఫిర్యాదులు అందిన వెంటనే కేసులు నమోదు చేస్తున్నారు. సాంకేతికత ఆధారంగా దర్యాప్తును వేగవంతం చేసి కేసు ప్రాధాన్యతను బట్టి ఏడు రోజుల లోపే కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేస్తున్నారు. నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చూస్తున్నారు. ఇప్పటికే వివిధ కేసుల్లో త్వరితగతిన శిక్షలు పడ్డాయి.

దిశ పోలీస్‌స్టేషన్‌కు అందిన ఫిర్యాదులు

సంవత్సరం	ఫిర్యాదులు	ఎఫ్ఐఆర్	పరిష్కారం	పెండింగ్
2020	839	182	657	--
2021	1,893	321	1,572	--
2022	933	73	860	--
2023	919	80	839	--
2024	190	09	147	34

ఇప్పటి వరకు



అధునాతన దిశ వాహనం

దిశ యాప్ బ్రహ్మాస్త్రం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల భద్రతకు దిశ రక్షణాస్త్రాన్ని అందించారు. ఆపదలో ఉన్న అతివలకు దిశ యాప్ ఆయుధం అయింది. మహిళలు, యువతులకు ఈ యాప్ బ్రహ్మాస్త్రంగా మారింది. దీనిని వినియోగించుకుని ఇప్పటికే పలువురు మహిళలు రక్షణ పొందారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి మహిళ, యువతి సెల్‌ఫోన్‌లో దిశ యాప్ రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఆపద సమయంలో యాప్ ద్వారా రక్షణ ఎలా పొందాలన్న విషయంపై అవగాహన కల్పిస్తున్నారు. దిశ ఎస్‌ఓఎస్‌కు వివిధ సమస్యలపై 1,994 కాల్స్ వచ్చాయి. 129 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. పోలీసులు సకాలంలో స్పందించి చర్యలు తీసుకుంటుండడంతో నిందితులకు శిక్షలు పడుతున్నాయి.



దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

మహిళల భద్రతే ధ్యేయం



మహిళల భద్రతే ధ్యేయంగా పనిచేస్తున్నాం. వారికి ఎలాంటి అన్యాయం జరిగినా ఉపేక్షించం. చిన్నచిన్న సమస్యలతో వచ్చిన కాపురాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చి కాపురాలను చక్కదిద్దుతున్నాం. దిశ యాప్ వినియోగంపై విస్తృత అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి మహిళా సెల్‌ఫోన్‌లో యాప్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆపద సమయంలో దిశ యాప్ సేవలను వినియోగించుకుని రక్షణ పొందవచ్చు.

– కె.తిరుమలేశ్వరరెడ్డి, ఎస్పీ

పూత దశలోనే ఫలరాజు

అనుకూలించని వాతావరణ పరిస్థితులు

- దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం
- రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి
- మామిడి నాణ్యతకు ఉద్యాన శాఖ సమావేశాలు

ఈ ఏడాది ఫలరాజు దిగుబడి ఆశించిన స్థాయిలో ఉండే పరిస్థితి కనిపించడం లేదు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని కారణంగా పూత ఆలస్యమైంది. అందులోనూ పూర్తిస్థాయిలో పిందెలుగా మారే అవకాశం కనిపించడం లేదు. ప్రతి ఏటా ఈపాటికే పూత అధికంగా వచ్చేది. ప్రస్తుతం తోటల్లో కేవలం 40 నుంచి 50 శాతం మాత్రమే కనిపిస్తోంది.


పూత తక్కువగా వచ్చిన చెట్టు

ఉలవపాడు: జిల్లా పరిధిలో సుమారు 23 వేల హెక్టార్లలో మామిడి సాగవుతుంది. ఒక్క ఉలవపాడు పరిధిలో సుమారు 10 వేల హెక్టార్లలో పంట ఉంది. వాస్తవానికి ఈపాటికే పిందెలు వచ్చి ఉండాలి. కానీ ఉష్ణోగ్రతల్లో మార్పు కారణంగా ఎక్కడా ఆ పరిస్థితి లేదు. కేవలం పూత దశే ఉంది. అది కూడా 50 శాతం మాత్రమే. రాష్ట్ర వ్యాప్తంగా 43.81 లక్షల హెక్టార్లలో మామిడి సాగవుతుండగా దాదాపు అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ప్రభావం దిగుబడిపై పడుతుందని భావిస్తున్నారు.

ఇక్కడిలా..

మామిడి అంటే గుర్తుకొచ్చేది ఉలవపాడు ప్రాంతం. ఇక్కడి బంగినపల్లికి అంతర్జాతీయ గుర్తింపు ఉంది. ఎప్పుడూ జనవరిలోనే పూత ఉండి ఏప్రిల్ చివరికి కాయలు అందుబాటులోకి వచ్చేవి. ఈసారి ఫిబ్రవరి చివరికి కూడా పూత దశే ఉంది. దీంతో ఏప్రిల్ చివరి వారంలో కాయలు అందుబాటులోకి వచ్చే పరిస్థితి ఉంది. ఇంకా మామిడి చాలా ప్రియంగా ఉండొచ్చు. రైతులు కూడా తమ వంతు ప్రయత్నంగా పూత కోసం మందులు పిచికారీ చేస్తున్నారు. అయినా ఆశించిన స్థాయిలో ప్రయోజనం ఉండటం లేదు.

సమావేశాలు

ఉద్యాన శాఖ సలహాలతో పంటను నాణ్యతతో దిగుబడి చేసి మామిడి ప్రియులకు అందించడానికి రైతులు కష్టపడుతున్నారు. ఇందులో భాగంగా పూతను రావడానికి, ఉన్న దానిని పంటగా మార్చుకోవడానికి ఏమి చేయాలో ఉద్యాన శాఖ అధికారులు సమావేశాలు నిర్వహించి సూచనలిస్తున్నారు.

పూత రావడానికి ప్రత్యేక మందులు ఉండవని, అదనంగా మందులు పిచికారీ చేయవద్దని తెలియజేస్తున్నారు. రైతులు ఇప్పటికే ఆరు నుంచి ఎనిమిది సార్లు మందులు పిచికారీ చేశారు. కేవలం నీరు కట్టడం తప్ప మందులు వాడవద్దని ఆ శాఖ సూచిస్తోంది.

నాణ్యతపై ప్రత్యేక దృష్టి

ఉన్న పంటను కాపాడుకోవడంతోపాటు కాయల నాణ్యతపై అటు ఉద్యాన శాఖ అధికారులు, ఇటు రైతులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ఏడాది సీజన్ ఆలస్యమవుతుంది. తక్కువ దిగుబడి వస్తుంది కాబట్టి కాయల నాణ్యత బాగుంటే మంచి లాభాలు ఉంటాయని రైతులకు అధికారులు తెలియజేస్తున్నారు. గతంలో పండుఈగ కారణంగా ఉలవపాడు ప్రాంతంలో కాయల్లో పురుగులు వచ్చాయి. దీని నివారణకు ఆకర్షణ బుట్టలు పెట్టడం, కవర్లు కట్టడం చేశారు. ఈ ఏడాది ఈ పని పూర్తి స్థాయిలో చేస్తే నాణ్యత గల కాయలు అమ్మకానికి ఉంటాయి.

అవగాహన కల్పిస్తున్నాం



వాతావరణ పరిస్థితులను తట్టుకుని మామిడి సాగు ఎలా చేయాలనే విషయాలపై రైతులకు పూర్తి అవగాహన కల్పిస్తున్నాం. ఈ ఏడాది పూత తగ్గింది. ఉన్న దానిని పంటగా మార్చి నాణ్యమైన దిగుబడి వచ్చేలా కృషి చేస్తున్నాం.

– సుబ్బారెడ్డి, జిల్లా ఉద్యానశాఖాధికారి

ఖర్చు తగ్గించుకోవాలి



ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మామిడి రైతులు ఖర్చు తగ్గించుకోవాలి. అధికంగా మందులు పిచికారీ చేస్తే ఖర్చు పెరిగి చెట్టుపై భారం పెరుగుతుంది. ఇలా చేయొద్దు. మామిడి సీజన్‌లో కాయలను చివరి వరకు ఉంచొద్దు.

– శ్రీనివాసరెడ్డి, ఉద్యాన శాస్త్రవేత్త

తక్కువగా ఉంది



ఈ ఏడాది పూత తక్కువగా ఉంది. దీంతో కాయలు ఆలస్యంగా రావొచ్చు. మందులు పిచికారీ చేశాం. అయినా పూర్తిగా పూత రాలేదు.

– గోపాల్‌రెడ్డి, రైతు, ఉలవపాడు

వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం


ఎంపీ ఆదాలతో కలిసి హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తున్న మేయర్, ఆనం తదితరులు

- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ మండలంలోని కాకుపల్లిలో రూ.26 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థను తీసుకురావడంతో ఆయా ప్రాంతాల ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం అవుతున్నాయన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పేదలకు ఎంతో ఉపయోగపడుతున్నట్లు చెప్పారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య చేయించుకునే అవకాశం దొరికిందన్నారు. టీడీపీ హయాంలో రూరల్ నియోజకవర్గాన్ని పట్టించుకోలేదన్నారు. తాము ఎన్నో పనులు చేయడం జరిగిందన్నారు. చంద్రబాబు వస్తే సంక్షేమ పథకాలను ఆపేస్తారన్నారు. అందువల్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, సర్పంచ్ కోసూరు సుభాషిణి, రూరల్ ఎంపీపీ విజయకుమార్, నాయకులు కోసూరు కేశవులు గౌడ్, శివసునీల్‌రెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని డ్రైవర్ మృతి

ఉలవపాడు: జంక్షన్ వద్ద మలుపు తిరుగుతున్న లారీని మరో లారీ ఢీకొంది. దీంతో ఓ డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన కరేడు ర్యాంపు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. లారీ గుంటూరు నుంచి బొగ్గులోడుతో బయలుదేరింది. కరేడు ర్యాంపు వద్ద కంపెనీలోకి మలుపు తిరుగుతున్న సమయంలో చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ దానిని ఢీకొంది. హైదరాబాద్ లారీ ముందు భాగం నుజ్జు నుజ్జయింది. దీంతో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన డ్రైవర్ మహ్మద్ ఖరీద్ (24)కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అక్కడే ఉంచారు. వారి బంధువులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు కృషి

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న రామిరెడ్డి

కావలి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసేందుకు అందరం కలిసి కృషి చేద్దామని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఆయన ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ 2014, 19 ఎన్నికల్లో తన విజయంలో ఆర్యవైశ్యుల పాత్ర కూడా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్యవైశ్యులకు అండగా నిలిచారన్నారు. ఆయన్ను రెండోసారి సీఎంను చేసేందుకు కృషి చేయాలని కోరారు. వారు మాట్లాడుతూ రామిరెడ్డిని మూడోసారి గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు.

మేలు చేశాం.. ఆశీర్వదించండి


వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: 'టీడీపీ పాలన కంటే వైఎస్సార్‌సీపీ హయాంలోనే ప్రజలకు ఎంతో మేలు జరిగింది. అందువల్ల వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలి' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. మండలంలోని కొత్తూరులో ఆదివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను, రీసర్వే చేసిన పొలాలకు సంబంధించి రైతులకు పాసు పుస్తకాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు వెళ్లే విద్యార్థుల నుంచి సీనియర్ సిటిజన్స్ వరకు ప్రతి ఒక్కరూ వలంటీర్ల ద్వారా పథకాలు పొందుతున్నారన్నారు. చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎల్లో మీడియా విలువలు వదిలేసిందన్నారు. బాబు చేసిన తప్పులకు శిక్ష అనుభవించక తప్పదన్నారు. పవన్ కళ్యాణ్ ఇప్పుడు డబ్బుకు అమ్ముడుపోయి 24 అసెంబ్లీ, మూడు పార్లమెంట్ సీట్లు మాత్రం తీసుకున్నాడని చెప్పారు. బాబును సీఎంను చేసేందుకు కాపులను మోసం చేస్తున్నారన్నారు. జనసేన, బీజేపీని కలుపుకొని జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించాలని టీడీపీ అధినేత ప్రయత్నిస్తున్నారన్నారు. పేదలతోనే జగన్‌కు పొత్తు అని, మరెవరితో ఉండదన్నారు. ప్రజలు బాగుండాలని ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆర్థికంగా అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో యువజన విభాగం కోవూరు నియోజకవర్గం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, ఇందుకూరుపేట రూరల్ బ్యాంక్ చైర్మన్ గునుపాటి సురేష్‌రెడ్డి, ఎంపీపీ గంధళ్ల శంకరయ్య, మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి

- ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ


ర్యాలీలో పాల్గొన్న రాష్ట్ర నాయకులు

పొదలకూరు: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం నెల్లూరు రూరల్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలకు చేయూతనందించి వారి పిల్లల చదువుకు సాయం చేయాల్సిందిగా సూచించారు. అధ్యక్షుడిగా ఆమర్తలూరు చెంచయ్య, ప్రధాన కార్యదర్శిగా చందా వెంకటస్వామి, వర్కింగ్ సెక్రటరీగా పొట్టి సుధాకర్, కోశాధికారిగా తెలన్నాకుల ఆదినారాయణ, యువజన విభాగం అధ్యక్షుడిగా రాజా సురేంద్ర ప్రమాణ స్వీకారం చేశారు. మండల, పట్టణ యువజన ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారం కూడా నిర్వహించారు. ముందుగా ర్యాలీగా కల్యాణ మండపం వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెంటా వీరబ్రహ్మం గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరివీధి ప్రకాశ్‌రావు, ప్రధాన కార్యదర్శి షణ్ముఖరావు, కోశాధికారి శ్రీనివాస్ జిల్లా, మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు, కార్యకర్తలు, మహిళా బాధ్యులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న రాజమోహన్‌రెడ్డి

మర్రిపాడు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆత్మకూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించేలా అందరూ కృషి చేయాలని నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. బ్రాహ్మణపల్లిలోని నివాసంలో ఆదివారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆయన మాట్లాడారు. పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగేందుకు కష్టపడి పనిచేయాలన్నారు. ప్రజలను కలిసి పథకాలను వివరించాలన్నారు. ఆత్మకూరు అభివృద్ధికి ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. ఆయన గెలుపే లక్ష్యంగా క్లస్టర్ ఇన్‌చార్జిలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, జేసీఎస్ కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, బూత్ కమిటీ మేనేజర్ రేవూరు వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు నారపరెడ్డి సుబ్బారెడ్డి, కోనంకి శ్రీనివాసులునాయుడు, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	రూ.75
సన్నవి	రూ.60
పండ్లు	రూ.22

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 156	బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	
లేయర్ (లైవ్)	: 80	300	
బ్రాయిలర్ చికెన్	: 270	లేయర్ చికెన్ : 136	